ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ నికోల్‌టుంగ్ ఆర్ట్ టాక్

మాదాపూర్: ఫొటోగ్రఫీ అనేది సులువైన పనికాదని ప్రఖ్యాత ఫొటోగ్రాఫర్ నికోల్ టుంగ్ అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆదివారం ఆర్ట్ టాక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘర్షణ ప్రాంతాలు, మానవ హక్కుల సమస్యలను తెలుపుతూ స్ఫూర్తిదాయక అంశాలను తెలిపారు. సిరియా, ఇరాక్, అఫ్ఘనిస్తాన్‌తోసహ ప్రపంచంలోని కొన్ని అత్యంత సవాలు, ప్రమాదకరమైన ప్రదేశాల్లో పనిచేసినట్టు తెలిపారు. యుద్ధం, స్థానభ్రంశం కారణంగా ప్రభావితమైన పౌరుల అనుభవాలను సంగ్రహించినట్టు పేర్కొన్నారు. పలు ఉదారణలతో ఆసక్తికర అంశాలను తెలిపారు.

సగర సంఘం అధ్యక్షుడిగా బాలరాజ్ సాగర్



రాయదుర్గం: సగర సంఘం రాయదుర్గం అధ్యక్షుడిగా బాలరాజ్ సాగర్ ఆదివారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా రవీందర్, కోశాధికారిగా యాదగిరి, రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా రామును సభ్యులు ఎన్నుకున్నారు. అనంతరం బాలరాజ్ సాగర్ మాట్లాడుతూ సగరుల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో సంఘం కార్యవర్గం, సభ్యులతో కలిసి సమష్టిగా పనిచేస్తామన్నారు. రెండోసారి వరుసగా అవకాశం కల్పించినవారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులైన సగరలకు అందేలా చూస్తామన్నారు.

దేశంలో ఉచిత వైద్యం ప్రవేశపెట్టాలి

పటాన్‌చెరు టౌన్: దేశంలో ఉచిత వైద్యాన్ని ప్రవేశపెట్టాలని సీపీఎం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్ అన్నారు. సీపీఎం రాష్ట్ర నాలుగో మహాసభల సందర్భంగా ముత్తంగిలోని గాయత్రీనగర్‌లో ఆదివారం ప్రణం ఆస్పత్రి సహకారంతో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశంలో ప్రజలందరికీ ఉచిత వైద్య పథకాన్ని ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు ఏరియా కార్యదర్శి నాగేశ్వరరావు, సీపీఎం నాయకులు రాజు, ఆంజనేయులు అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు కాపాడాలి

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని కాజీపల్లి పంచాయతీ పరిధిలో ప్రభుత్వ భూములను అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబర్ 181లోని ఖాళీ స్థలాలపై కన్నేసి బండరాళ్లను తొలగిస్తూ రాత్రికి రాత్రి కబ్జాకు పాల్పడుతున్నారని వాపోయారు. అధికారులు ప్రభుత్వ భూముల పరిరక్షణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

పేద విద్యార్థికి చేయూత

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల మండల కేంద్రానికి చెందిన పేద విద్యార్థి ఉన్నత చదువులకు బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి చేయూతనందించారు. గ్రామానికి చెందిన దేవర్ల ప్రభాకర్ కుమారుడు కార్తీక్ ఉన్నత చదువులకు కుటుంబ ఆర్థిక పరిస్థితి అడ్డంకిగా మారిన నేపథ్యంలో విషయం తెలుసుకున్న గోవర్ధన్ రెడ్డి అండగా నిలిచి ఆర్థిక సహాయాన్ని అందించారు.

బ్రాహ్మణకుంట పనులకు శంకుస్థాపన

జిన్నారం (పటాన్‌చెరు): గ్రామీణ ప్రాంత రైతులకు అండగా నిలుస్తున్న ఆగ్రో ఫౌండేషన్, ఏషియన్ పెయింట్స్ సంస్థల ప్రతినిధులకు లక్ష్మీపతి గూడెం గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు. ఆదివారం గ్రామంలోని బ్రాహ్మణ కుంట కట్ట మరమ్మతు పనులకు సంస్థ ప్రతినిధులు గ్రామస్తుల సమక్షంలో శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు విజయ్ కుమార్, గజేంద్ర, విష్ణు ప్రకాష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

జిన్నారం (పటాన్‌చెరు): ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన సంఘటన గుమ్మడిదల మండల కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జిన్న కనకయ్య గడ్డివాము ప్రమాదవశాత్తు కాలి బూడిదైంది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితుడికి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

సంఘీభావ సభను విజయవంతం చేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించాలని కోరుతూ ఈ నెల 11న ఉస్మానియా యూనివర్సిటీలో చేపట్టిన మేధావుల సంఘీభావసభను విజయవంతం చేయాలని రాష్ట్ర మాదిగ ఉద్యోగుల సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మందా దేవేందర్, బెల్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. బెల్ కాలనీలో మేధావుల సంఘీభావ సభ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు.

గుల్ మొహర్ పార్కు కాలనీ సమీపంలో నిర్మాణంలో ఉన్న భవనంలో నిలిచిన మురుగునీరు.. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం పేరుకుపోయిన ప్రాంతం..





దుర్వాసన.. దోమల బెడద

గుల్‌మొహర్ పార్కు కాలనీవాసుల అవస్థలు



శేరిలింగంపల్లి: భారీ భవన నిర్మాణం రెండు దశాబ్దాలుగా సాగడంతో స్థానికుల పాలిట శాపంగా మారుతోంది. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గుల్‌మొహర్‌పార్కు కాలనీలో సమీపంలో లెజెండ్ నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న భారీ భవన నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం కొనసాగుతోంది. నిర్మాణ సామగ్రి ఏళ్లుగా పడేసి ఉండటం, భవనం చుట్టూ కుంట మాదిరిగా మారడం, చెత్తాచెదారం పడేయం , పిచ్చిమొక్కలు మొలవడంతో గుల్‌మొహర్ పార్కు కాలనీలో దోమల వృద్ధి చెంది స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. ఇళ్ల మధ్యన వర్షం నీరు నిల్వ ఉండటం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. దుర్వాసన, దోమల బెడదలతో నానా ఇక్కట్ల పాలవున్నామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని నీటి నిల్వ లేకుండా చూడాలని, పిచ్చిమొక్కలు, కంపచెట్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేనియెడల ఆందోళన చేస్తామని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

పేద కుటుంబానికి కుట్టుమిషన్ అందజేత



పేద కుటుంబానికి కుట్టుమిషన్ అందిస్తున్న అభిషేక్ గౌడ్

రాయదుర్గం: పేద కుటుంబ జీవనోపాధి కోసం కుట్టుమిషన్‌ను శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ద్వారా ఆదివారం అందించారు. రాయదుర్గంలో నివాసముండే సురేష్, అరుణ దంపతులకు శ్రీకృష్ణయూత్ అధ్యక్షుడు అభిషేక్‌గౌడ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో పేదలకు చేయూత అందించేందుకు శ్రీకృష్ణ యూత్ ముందుంటుందన్నారు. ఇప్పటివరకు పది కుటుంబాలకు కుట్టుమిషన్లు అందించినట్లు పేర్కొన్నారు. యువతకు హెల్మెట్లు, మహిళలకు చీరలు, నిరుపేద కుటుంబానికి ఇంటి నిర్మాణానికి సహాయం అందించామని గుర్తు చేశారు. వినాయక్‌నగర్‌లో జీహెచ్‌ఎంసీ పార్కును అభివృద్ధి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణయూత్ అసోసియేషన్ సభ్యులు సంగమేష్, దేవేందర్, సందీప్, ముర్తజా, విక్కీ, అమన్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి దారుణ హత్య



మియాపూర్: మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాఫీజ్‌పేట్‌లో గుర్తుతెలియని వ్యక్తి(35) దారుణ హత్యకు గురయ్యాడు. సీఐ క్రాంతి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం ఉదయం సమయంలో హాఫీజ్‌పేట్ రైల్వే స్టేషన్ దగ్గరగ ఓ వ్యక్తి రక్తస్రావంతో పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీంతో సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించగా, అతనికి సంబంధించిన ఎలాంటి గుర్తింపు కార్డులు కూడా లభించలేదు. శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు సిమెంట్ ఇటుకతో అతడి తలపై కొట్టడంతో తలకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మియాపూర్ సీసీ ఫుటేజీలను పరిశీలించి హంతకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అతను బ్లాక్ జాకెట్, బ్లూ జీన్స్, కుడిచేతిపై లవ్ సింబల్ టాటూ ఉన్నట్లు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరంభ్ టౌన్‌షిప్‌లో రంగోలీ పోటీలు

శేరిలింగంపల్లి: ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి ఆరంభ్ టౌన్‌షిప్‌లో రంగోలీ పోటీలను ఆదివారం నిర్వహించారు. పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ టి.రామస్వామి యాదవ్ మాట్లాడుతూ పండుగలు ప్రాచీన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్ల పరిధిలోని 35 కాలనీల్లో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా టి.వరలక్ష్మీ, అనూష వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు విజయలక్ష్మీ, సత్యవాణి, సుశీల, త్రివేణి, మమతా, సత్య, కనకదుర్గ, నాగలక్ష్మీ, అనూషా, శర్మిష్టా తదితరులు పాల్గొన్నారు.



ఆరంభ్ టౌన్‌షిప్‌లో నిర్వహించిన పోటీల్లో రంగవల్లులు వేస్తున్న మహిళలు

మల్లన్న ఆశీస్సులతో సుభిక్షంగా ఉండాలి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- ఘనంగా బండల మల్లన్న జాతర మహోత్సవం



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

పటాన్‌చెరు: మల్లన్న స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ కేతకీ రేణుక ఎల్లమ్మ మల్లికార్జున స్వామి దేవాలయంలో నిర్వహించిన స్వామి వారి కల్యాణ మహోత్సవం, జాతరకు ఎమ్మెల్యే దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నప్రసాద వితరణ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ...తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు జాతరలు ప్రతీక అన్నారు. నియోజకవర్గంలో నూతన దేవాలయాలతో పాటు పురాతన ఆలయాల పునరుద్ధరణకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పటాన్‌చెరు మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ, కల్పన, పల్లవి, మల్లేశ్‌యాదవ్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం

కాంగ్రెస్ నేత నీలం మధు

పటాన్‌చెరు: ఆత్మరక్షణ, క్రమశిక్షణకు కరాటే దోహదం చేస్తుందని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం కంది మండలం ఎద్దుమైలారం పరిధిలోని ఓడీఎఫ్ సారత్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వాహకులు శ్రీనివాస్ బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 8వ స్టేట్ లెవెల్ కరాటే పోటీలను జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు, టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. యుద్ధకళగా ప్రచారంలోకి వచ్చిన కరాటే వ్యక్తిగత ఆత్మరక్షణతో పాటు వ్యాయామం గాను పనికొస్తుందన్నారు. మహిళలు తమ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. కరాటే శిక్షణ అందిస్తూ ఎంతోమంది కరాటే సాధకులను తయారు చేస్తున్న సక్సెస్ షోటోకన్ కరాటే నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో సెడీసీ చైర్మన్ రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పులి మామిడి రాజు, తలారి ఈశ్వర్, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి వెంకటేష్, రాజు గౌడ్, బాలు, సతీష్, పాండు, గోపాల్, నిర్వాహకులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలి

ఆల్విన్‌కాలనీ: అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్డు హోలిస్టిక్ హాస్పిటల్ వద్ద చేపడుతున్న వరద నీటి కాలువ పనులను అధికారులతో కలిసి ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పలు కాలనీల్లో ప్రజల నుంచి వచ్చిన వినతి మేరకు ప్రాధాన్యత ప్రకారం పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రజలు సంయమనం పాటించి ట్రాఫిక్ మళ్లింపు వద్ద క్రమశిక్షణతో అధికారులకు సహకరించాలని కోరారు. ఏ చిన్న సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తానన్నారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు

మాదాపూర్: కళాకారులు కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం యునైటెడ్ స్టేట్స్ న్యూయార్క్ నుంచి వచ్చిన కూచిపూడి కళాకారిణి మేఘన శివాష్టకం ప్రదర్శించి ఆహుతులను ఆకట్టుకున్నారు. టొరంటో కెనడాలో నాట్యకళా మంజరి భరతనాట్య అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థను స్థాపించిన సంజీ పిరంతాపం శిష్యబృందం వసంత ఉత్సవ్ కళాకారులు రిందా, అక్ష, ఇరా, అదితి భరతనాట్య ప్రదర్శనలో పుష్పాంజలి, నటేశ కౌతం, కీర్తనం, పాహిమాం రాజరాజేశ్వరీ, , జతిస్వరం , కీర్తనం, అన్నమాచార్య కృతి, కృష్ణలీల అంశాలను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు.





మాదాపూర్‌లోని శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: ట్రిపుల్ ఐటీ గచ్చిబౌలిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ భాస్కర్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11 కేవీ జీపీఆర్‌ఏ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి 10.30 గంటల వరకు, ఐఐఆర్‌సీఎల్ 11 కేవీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.దీంతో గచ్చిబౌలి, జీపీఆర్‌ఏ క్వార్టర్స్, ఐఐఆర్‌సీఎల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు గమనించాలని ఆయన సూచించారు.

కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్‌రంగారెడ్డి పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రాజరాజేశ్వరినగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తు న్నట్లు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు..

రాఘవేంద్రకాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో..

రాఘవేంద్రకాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రాఘవేంద్రకాలనీ-ఏ,బీ,సీ బ్లాక్స్‌లతోపాటు గోపాల్‌రెడ్డి నగర్ కాలనీలో విద్యుత్ సరపరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

చందానగర్: హాఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం మధ్యాహ్నం 12.00 నుంచి మధ్యాహ్నం 01.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- మాధవనగర్ ఫీడర్ పరిధిలో మాతృశ్రీనగర్ కొంత భాగం, మాధవనగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండన్నారు.
- మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 4.00 వరకు మాతృశ్రీనగర్ కొంత భాగం, విజయ సూపర్ మార్కెట్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండన్నారు.
- విశ్వంభర ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3.00 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు ఎస్‌ఎంఆర్, శ్రీలీలా, కల్వరి టెంపుల్, విశ్వంభర, శిల్పా ఎవెన్యూ, వాటర్ వర్క్స్, అపర్ణ, డబుల్ రూమ్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండన్నారు.

మాదాపూర్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మాదాపూర్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం కరెంటు సరఫరాకు అంతరాయం కలగనుందని అధికారులు తెలిపారు.

- 11కేవీ మైహోం ఫీడర్ మరమ్మతుల కారణంగా 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సీజీఆర్ స్కూల్ ప్రాంతాలు, బొల్లినేని హోమ్స్ తదితర ప్రాంతాలు.
- 11 కేవీ అయ్యప్ప సొసైటీ ఫీడర్ పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రుచి టిఫిన్ సెంటర్, ప్లాట్ నెంబర్స్ 450 నుంచి 490 వరకు, చందానాయక్ తాండ, బాలాజీ దేవాలయం, అయ్యప్ప సొసైటీ ప్రాంతాలు.
- 11 కేవీ పర్వత్‌నగర్ ఫీడర్, 11 కేవీ వివేకానంద నగర్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంట వరకు వివేకానందనగర్, పర్వత్‌నగర్, ప్రభుత్వ హాస్పిటల్ ఏరియా, ఎస్‌ఐఏ, వివేకానందనగర్ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని అధికారులు తెలిపారు.

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు
- పటాన్‌చెరులో 2కే రన్

పటాన్‌చెరుటౌన్: కార్మిక,కర్షక,ప్రజాసమస్యలు పరిష్కారం అవ్వాలంటే ఉద్యమాలు, పోరాటాలతోనే సాధ్యమని సీపీఎం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చైర్మన్, సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చుక్కా రాములు పేర్కొన్నారు. ఆదివారం ఉదయం పటాన్‌చెరు పట్టణంలో మహాసభల వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్‌తో కలసి 2కే రన్‌లో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి రామచంద్రపురంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు జరిగిన 2 కే రన్‌ను చుక్కా రాములు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కార్మిక వర్గ సమస్యలు పోరాటాలతోనే పరిష్కారం అవుతాయే తప్ప పాలకుల దయాదాక్షిణ్యాలపై కాదని ఇప్పటికే అనుభవంలో రుజువైందన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలను తిరస్కరించి మన కష్టాలు తీరుస్తారని కాంగ్రెస్‌కు పట్టం కడితే ఎక్కడి గొంగడి అక్కడే అన్న చందంగా కార్మికుల కనీస వేతనాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గం పైనే దాడి చేస్తోందని 49 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చిందని, గెజిట్ చేసే విధంగా ప్రయత్నిస్తుందని ఆరోపించారు. ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో జరిగే సీపీఎం రాష్ట్ర మహాసభలో తెలంగాణ సమగ్రాభివృద్ధి కార్మిక కర్షక ప్రజా సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వాజిద్ అలీ, పాండు రంగారెడ్డి, నాగేశ్వరరావు, ఎం శ్రీనివాస్, బంగారురాజు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



2కే రన్‌ను ప్రారంభిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్కా రాములు